క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



పోలింగ్ కేంద్రంలో సిబ్బంది

• 809 మంది ఉపాధ్యాయులకు ఓటు హక్కు

గాజువాక: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గాజువాక సెగ్మెంట్‌కు సంబంధించి 809 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతోపాటు ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు కూడా ఓటు హక్కు కల్పించడంతో ఈసారి ఎన్నిక ప్రతిష్టాత్మకంగా మారిన విషయం తెలిసిందే. గాజువాక సెగ్మెంట్‌లోని గాజువాక మండలంలో 708 మంది, పెదగంట్యాడ మండలంలో 101 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వారికోసం గాజువాక జెడ్పీ హైస్కూల్‌లో ఒక పోలింగ్ కేంద్రం, పెదగంట్యాడలోని నడుపూరు జెడ్పీ హైస్కూల్‌లో మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలకు చేరుకున్న పోలింగ్ సిబ్బంది ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. అవసరమైన విద్యుత్ సౌకర్యం, మంచినీటి సౌకర్యం కల్పించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఇద్దరు పోలీసు సిబ్బందితోపాటు పీవో, ఏపీవో, ఓపీఓలను అందుబాటులో ఉంచారు. పోలింగ్ కేంద్రం వద్ద సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు.

ప్రజలకు మేలు జరగాలంటే జగనే రావాలి



నాగిరెడ్డిని కలిసిన 87వ వార్డు నాయకులు

కూర్మన్నపాలెం: పేద, బడుగు బలహీన వర్గాలకు మేలు జరగాలంటే మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిందేనని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల డిప్యూటీ కో ఆర్డినేటర్ తిప్పల నాగిరెడ్డి పేర్కొన్నారు. తనను బుధవారం కలిసిన 87వ వార్డు నాయకులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తిరిగి పార్టీ అధికారంలోని రావడానికి ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు సాగాలన్నారు. ప్రతి కార్యకర్త ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలన్నారు. నాగిరెడ్డిని కలిసిన వారిలో బీసీ సెల్ నాయకులు బొండాగోవింద్‌రాజులు, మురళీ మోహన్, సూరిబాబు,ఈశ్వరరావు,దానప్పలు తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న అప్పలరాజు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో కుంచమాంబ, దుర్గమాంబ అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేస్తున్నారు. బుధవారం అక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కామాడ అప్పలరాజు, భవాని దంపతులు రూ.20,116 ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు.

కాంట్రాక్ట్ కార్మికురాలికి సత్కారం



కాంట్రాక్ట్ కార్మికురాలిని అభినందిస్తున్న డీజీఎం నంద, నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ విభాగం కాంట్రాక్ట్ కార్మికురాలు చందుభాయ్‌ను అధికారులు, కార్మిక నాయకులు అభినందించారు. టెక్నలాజికల్ అసిస్టెంట్ వద్ద కార్మికురాలిగా పనిచేస్తున్న చందుభాయ్ ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా స్టీల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం విభాగం డీజీఎం కె. నంద ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉప్పిలి రామకృష్ణతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

శంభో.. శివ శంభో



మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గాజువాక ప్రాంతం శివనామస్మరణతో మార్మోగింది. బుధవారం వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. హరహర మహాదేవ నామస్మరణతో హోరెత్తించారు. భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. తులసికోట, ధ్వజస్తంభం, నందీశ్వరుని వద్ద దీపారాధన చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆయా ఆలయాల కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి.



బాలచెరువులోని ఉమారామలింగేశ్వర ఆలయంలో అభిషేకం చేస్తున్న వాసుదేవశర్మ



పాలతో శివలింగాన్ని అభిషేకిస్తున్న అర్చకులు



బాపూజీ కాలనీలో మల్లికార్జునుల కల్యాణం



పూజలందుకుంటున్న అప్పికొండ సోమేశ్వరస్వామి



వుడా డబుల్ రోడ్డులోని ఉమారామలింగేశ్వరాలయంలో ధ్వజస్తంభం వద్ద పూజలు



అలంకరణలో పెదమడక ఉమామహేశ్వరస్వామి



అక్కిరెడ్డిపాలెంలో పూజలందుకుంటున్న ఉమారామలింగేశ్వరుడు



అప్పికొండ ఆలయ ఆవరణలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్



స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సమితి ఆధ్వర్యంలో భక్తుల పూజలు

గాజువాక/అగనంపూడి/ఉక్కునగరం/అక్కిరెడ్డిపాలెం/పెదగంట్యాడ/ కూర్మన్నపాలెం: వుడాడబుల్ రోడ్‌లోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో గర్భ గుడిలోని మహా శివలింగాన్ని అర్చకులు అభిషేకించారు. లింగోద్భవ కాలంలో స్వామివారికి 2025 లీటర్ల పాలతో విశేష అభిషేకం చేశారు.

- వినాయకనగర్ వుడాకాలనీలోని కాశీ విశాలాక్షి విశ్వేశ్వర సహిత పంచాయతన ఆలయం, పాత గాజువాకలోని చట్టివానిపాలెం, చిట్టినాయుడు కాలనీ ఈశ్వరాలయం, అయ్యప్పస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.
- దుర్గవానిపాలెం, గాజువాక గౌరీపరమేశ్వరుల ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీసీరోడ్డు సంజీవకాలనీలో భద్రావతి భావనా రుషీశ్వరుల సమేత సత్యనారాయణ స్వామి ఆలయం, సత్తెమ్మ తల్లి ఆలయంలో పూజలు ఘనంగా నిర్వహించారు.
- దుర్గానగర్‌లోని శ్రీదుర్గా గణపతి సమేత మహాజ్ఞాన సరస్వతి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చినగంట్యాడ వందడుగుల రోడ్‌లోని మంజునాథ ఆలయంలో విశేష పూజలు చేశారు.
- స్థానిక వుడాకాలనీ వినాయకనగర్‌లోని పంచాయతన ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. 71వ వార్డు సుందరయ్య కాలనీ శివాలయం వద్ద నిర్వహించిన అన్న సమారాధనను వీవర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పప్పు రాజారావు, బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, స్థానిక నాయకుడు కరణం కనకారావు ప్రారంభించారు.

మార్మోగిన శివ నామస్మరణ

జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని తరించారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ స్వయంగా ఏర్పాట్లు పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు బందో బస్తు నిర్వహించాలన్నారు. ఆయన వెంట మండల తహసీల్దార్ అమల, ఆలయ ఈవో కె శ్రీనివాస్, జీవీఎంసీ ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్ ఉన్నారు.

- జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని బాలచెరువు ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు వాసుదేవశర్మ పంచామృతాలతో అభిషేకాలు, హోమాలు, రుద్రాభిషేకాలు చేశారు.
- హౌసింగ్ బోర్డు కాలనీలోని వాసవీ కన్యకాపరమేశ్వరి పంచాయతన దేవాలయంలో ఆలయ కమిటీ సభ్యుడు ముత్యాలశెట్టి ఆధ్వర్యంలో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు.
- బాపూజీ కాలనీలో గౌరీ సేవా సంఘం సభ్యులు బీశెట్టి రమణబాబు, యశ్వంత్ నగేష్, మద్దాల అప్పారావు ఆధ్వర్యంలో స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు.
- నడుపూరులోని మహా మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో కమిటీ ప్రతినిధులు మంత్రి నరసింహమూర్తి, జయంతి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శివోహం

- అక్కిరెడ్డిపాలెంలోని ఉమారామలింగేశ్వరాలయంలో వేకువ జాము నుంచే పూజలు చేశారు. బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు పరమేశ్వరుడి నిజరూప దర్శనాన్ని భక్తులకు కల్పించారు. అనంతరం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.

హరోం హర..

- 85వ వార్డు పెదమడకలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ఉదయం మూడు గంటల నుంచి పూజలు ప్రారంభించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు గెద్దాడ అప్పలరాజు, కొలిపాక అప్పారావు, కరణం సన్ని, విందుల సతీష్, సూర్య, అమరపిని సోమేష్, కరణం శంకర్, బలిరెడ్డి సన్ని ఏర్పాట్లు పర్యవేక్షించారు.
- బీసీ కాలనీలోని బ్రహ్మకుమారీస్ ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగాలను వేలాది మంది దర్శించుకున్నారు. జిల్లా ఇన్‌చార్జి బీకె వేణి, కోఆర్డినేటర్ బీకే సోమేశ్వరి, బీకే రామకోటి పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించారు.
- అగనంపూడి జాబిలీహిల్స్‌లోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో శివునికి మహా రుద్రాభిషేకం జరిపించారు.
- పాత దానబోయినపాలెంలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శనివాడ, గళ్లవానిపాలెం పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొని పూజలు చేశారు.

హరహర మహాదేవ



కణితి రామాలయంలో నిర్వహించిన రుద్రాభిషేకాల్లో పాల్గొన్న భక్తులు

కూర్మన్నపాలెం పరిసర ప్రాంతాల్లోని వివిధ ఆలయాల్లో శివరాత్రిని పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. కణితి సంతమామిడితోట శివాలయానికి ఉక్కు నిర్వాసిత కాలనీల ప్రజలు తండోప తండాలుగా తరలివచ్చారు. తెల్లవారు జాము నుంచి క్యూలైన్‌లో నిలబడి పార్వతీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డగోవింద్,ఎన్నేటి రమణ, శంకరరావు, చిత్రాడ రమణ పాల్గొన్నారు.



సంతమామిడితో ఆలయంలో ప్రసాద వితరణ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- కణితి రామాలయం వద్ద ఐష్‌తో ఏర్పాటు చేసిన శివలింగానికి పూజలు చేసి రుద్రాభిషేకాలు నిర్వహించారు. పద్మశాలివీధి, మార్కెండేయ దేవాలయం, రాజీవ్‌నగర్, చాకలవీధి, యాదవజగ్గరాజుపేట, కూర్మన్నపాలెంలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

స్టీల్‌ప్లాంట్ ఆలయాల్లో..

- స్టీల్‌ప్లాంట్ సెక్టార్-2లో సత్యసాయి భక్తులు ఉదయం ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి సమితి కన్వీనర్ జి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- సెక్టార్-5 శివాలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. సాయంత్రం రుత్వికుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.
- స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు సమీపంలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు చీకటి శ్రీనివాస్, భద్రు నాయక్, సురేంద్ర, నాగభూషణరావు, మోహన్ రావు, రమణారెడ్డి పాల్గొన్నారు.
- స్టీల్‌ప్లాంట్ రవీరేస్ బంక్ సమీపంలోని పాత కణితి శివాలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డ గోవింద, ఆడారి శ్రీను, చిత్రాడ రాజు, పిన్నింటి సంతోష్, ఆలయ కమిటీ ప్రతినిధులు రామారావు, సన్యాసిరావు, అప్పలనాయుడు,శంకర్ తదితరులు పాల్గొన్నారు.



అభిషేకాలు చేస్తున్న అర్చకులు



జ్యోతిర్లింగాలను దర్శించుకుంటున్న భక్తులు



జాబిలీహిల్స్‌లో పూజలు చేస్తున్న భక్తులు



స్టీల్‌ప్లాంట్ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కల్యాణం



శివదర్శనం కోసం బారులు తీరిన భక్తులు



అక్కిరెడ్డి పాలెంలో భక్తుల కిటకిట



సుందరయ్య కాలనీ శివాలయం వద్ద వడ్డన చేస్తున్న కరణంరెడ్డి

నిబంధనలకు తూట్లు!

- బహిరంగంగా బొగ్గు ప్రాసెసింగ్
- పరిసరాలను కమ్మేస్తున్న నల్లటి ధూళి
- ప్రాణాంతకమని పారిశ్రామిక వేత్తల ఆందోళన
- రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్



లోపల గోడపై రాసిన కంపెనీ పేరు



గ్రేడ్లుగా విభజించి వేసిన బొగ్గు కుప్పలు

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతమైన ఆటోనగర్‌లో పలు సంస్థల నిర్వాహకులు నిబంధనలను తుంగలోకి తొక్కుతున్నారు. ఆటోనగర్ ఎఫ్ – బ్లాక్‌లో పరిశ్రమల మధ్య ప్రైవేట్ స్థలాల్లో ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకుండా బొగ్గు ప్రాసెసింగ్ చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అసలు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఉందా అని మానం కలుగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇదీ పరిస్థితి :ఆటోనగర్ ఎఫ్ – బ్లాక్‌లో పరిశ్రమల మధ్యలో ప్రైవేట్ స్థలంలో ఒక కాంట్రాక్టర్ కనాయ్ స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో బొగ్గు ప్రాసెసింగ్ యూనిట్‌ను నిర్వహిస్తున్నారు. ప్రాసెసింగ్ చేస్తున్న ప్రాంతం చుట్టూ పరదాలు కట్టేసి దర్జాగా పనులు సాగిస్తున్నారు. ఈ బొగ్గు స్టీల్ ప్లాంట్ నుంచి దిగుమతి చేసుకుని ప్రాసెస్ చేసిన తర్వాత తిరిగి స్టీల్‌ప్లాంట్‌కు తరలిస్తారని సమాచారం. ఇంత వరకూ బాగున్నా ఇలాంటి కాలుష్యకారక పనులు చేసేటప్పుడు దుమ్ముధూళి ఎగరకుండా షెడ్లు ఏర్పాటు చేసుకోవాలి. కానీ ఇక్కడ అలాంటి షెడ్లు మచ్చుకు కూడా కనిపించడం లేదు. దీంతో ప్రాసెసింగ్ చేస్తున్నప్పుడు బొగ్గు రేణువులు గాల్లో కలిసి పరిసర ప్రాంతాల పరిశ్రమలపై పడుతున్నాయి.

మౌనం ఎందుకో…!

గతంలో ఇదే తరహాలో బొగ్గు ప్రాసెస్ చేసిన మరో కంపెనీపై పలువురు పారిశ్రామిక వేత్తలు గందరగోళం సృష్టించారు. ఇప్పుడు అదే ప్రాంతంలో మరో కంపెనీ బయట బొగ్గు ప్రాసెస్ చేసి కాలుష్యానికి కారణమవుతున్నా అధికారులు ఎందుకు చోద్యం చూస్తున్నారో అంతుపట్టడం లేదు. మరోవైపు గతంలో జరిగిన బొగ్గు ప్రాసెసింగ్ పనులపై పారిశ్రామిక వేత్తలు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి మూయించారు. ఇప్పుడు దీనిపై ఎలాంటి తీసుకుంటారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కమ్మేస్తున్న బొగ్గు పౌడర్



ఆటోనగర్ ఎఫ్- బ్లాక్‌లో ఆ సంస్థ చేపడుతున్న బొగ్గు ప్రాసెస్‌తో చుట్టు పక్కల ఉన్న పరిశ్రమలను బొగ్గుపౌడర్ కమ్మేస్తుంది. పరిశ్రమల కోసం నిర్మించిన రోడ్డు కూడా నాశనం అయ్యింది. రోడ్డు నల్లగా మారి కళ్లలో పడుతుంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– ఈదుపుగంటి అనార్‌బాబు, పారిశ్రామిక వేత్త, ఆటోనగర్ ఎఫ్ – బ్లాక్

పరదాలు కడితే సరిపోదు



ఎఫ్ – బ్లాక్‌లో చేపడుతున్న బొగ్గు ప్రాసెసింగ్ చాలా ప్రాణాంతకమైంది. బొగ్గు పౌడర్ గాలిలో ఎగిరి చుట్టు పక్కల పరిశ్రమలతో పాటు కార్మికులకు ఇబ్బందికరంగా మారుతోంది. కార్మికులు శ్వాశకోశ వ్యాధులకు గురవుతున్నారు. పరదాలు కడితే సరిపోదు. ప్రాసెసింగ్ అనేది గొడౌన్ లాంటి వాటిలో చేపట్టాలి.

–ఎం.సూర్యనారాయణ, పారిశ్రామికవేత్త, ఆటోనగర్ ఎఫ్- బ్లాక్

స్టీల్‌క్లబ్‌లో మహాశివరాత్రి వేడుకలు



వేడుకలను ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ జీఎం ఘోష్

ఉక్కునగరం: మహాశివరాత్రి వేడుకలు స్టీల్‌క్లబ్‌లో ఘనంగా జరిగాయి. బుధవారం రాత్రి క్లబ్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలను స్టీల్‌ప్లాంట్ మెయింటెనెన్స్ జీఎం (ఇన్‌చార్జి) పి.ఎస్. ఘోష్ , క్లబ్ అధ్యక్షులు ఎం.ఎం. రావు, ఏసీఎస్ విభాగాధిపతి డాక్టర్ వి. చిట్టిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవులపల్లి దుర్గా ప్రసాద్ మహాశివరాత్రి విశిష్టతను వివరించారు. క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి వై. రవికుమార్, కోశాధికారి డి. వేణు గోపాల్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అక్కిరెడ్డిపాలెం: 11 కేవీ ఎల్వీనగర్ ఫీడర్ పరిధిలోని 33/11 కేవీ బ్లాక్ ఇండోర్ సబ్ స్టేషన్ చినగంట్యాడ సెక్షన్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జోన్ – 2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్.వి.నగర్ ఏరియా, డ్రైవర్స్ కాలనీ, కుంచమాంబ కాలనీ, తోకాడ ఏరియా, ఆటోనగర్ క్వార్టర్స్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

అలరించిన ఘంటసాల గానావధానం

సీతంపేట : మహా శివరాత్రి సందర్భంగా ఘంటసాల ఆరాధకుల టెలిగ్రామ్ గ్రూప్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం లలితానగర్‌లో గల స్వరాలయ స్టూడియోలో బుధవారం ఘంటసాల ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సయ్యద్ రహమతుల్లా ఆధ్వర్యంలో పలువురు గాయనీ గాయకులు ఘంటసాల ఆలపించిన ఆపాత మధుర గీతాలు ఆలపించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. నందగోపాల్ ఘంటసాల వేషంలో హావభావాలలతో, గానంతో అలరించారు. సోమయాజుల సత్యవేణి ఘంటసాల సావిత్రి వేషంతో మెప్పించారు. ఘంటసాల పాటలతో నందగోపాల్ ప్రదర్శించిన బుర్రకథ ఆకట్టుకుంది. డాక్టర్ సయ్యద్ రహమతుల్లా చేసిన గానావధానం సభికులను ఆశ్చర్యపర్చింది. కార్యక్రమంలో గాయనీగాయకులు రామ్మూర్తి, కల్యాణి, అంబిక, రాధ తదితరులు పాల్గొన్నారు.



ఘంటసాల పాటలపై అవధానం చేస్తున్న సయ్యద్ రహమతుల్లా

భక్తి శ్రద్ధలతో శాంతి కల్యాణం



అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి శాంతి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం స్వామి వారి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రం సందర్భంగా శాంతి కల్యాణం చేశారు. దివ్యక్షేత్రం ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.